ప్రజాశక్తి
బుధవారం 22 మార్చి 2023
5
శ్రీకాకుళం





మహా ధర్నాలో మాట్లాడుతున్న నాగమణి

# లక్ష్యం పెంచుతారా..?

- 5.58 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని నిర్ణయం
- ఇప్పటివరకు 5.26 టన్నుల ధాన్యం కొనుగోలు
- రైతుల వద్ద ఉండిపోయిన వేలాది టన్నుల ధాన్యం
- ఈనెల 30తో ముగియనున్న కొనుగోళ్లు

**ఖరీఫ్‌లో ఈ పర్యాయం ధాన్యం కొనుగోళ్లు ప్రహసనంగా మారిపోయింది. పండిన పంటలో 70 శాతమే కొనుగోలు చేస్తామని చెప్తూ వచ్చింది. రైతుల వద్ద పెద్దఎత్తున ధాన్యం ఉండిపోవడంతో తీవ్ర వ్యతిరేకత వస్తుందన్న అధికారుల సూచనతో ఫిబ్రవరి మొదటి వారంలో స్వల్పంగా లక్ష్యం పెంచింది. ఆ తర్వాత ఇక కొనుగోలు చేసేది లేదంటూ తేల్చిచెప్పింది. మరోసారి రైతుల్లో ఆందోళన రేగడంతో మరికొంత ధాన్యం కొనుగోలు చేసేందుకు అంగీకరించింది. రైతుల వద్ద ఇంకా వేలాది టన్నుల ధాన్యం ఉండిపోయిన నేపథ్యంలో లక్ష్యం పెంచుతారా?, కొనుగోళ్లు ఆపేస్తారా? అన్న ఆందోళన రైతుల్లో నెలకొంది.**

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



జిల్లాలో ఖరీఫ్‌లో 3,82,650 ఎకరాల్లో వరి సాగయింది. ఇందులో 3,75,518 ఎకరాల మేర ఈ-క్రాప్‌లో నమోదైంది. 8,11,120 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. రైతుల సొంత అవసరాలు, ఇతర అమ్మకాలు పోనూ సుమారు 4.38 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఫిబ్రవరి మొదటి వారంలోనే ఆ లక్ష్యం పూర్తయిపోయింది. అప్పటికే రైతుల వద్ద పెద్దఎత్తున ధాన్యం నిల్వలు ఉండిపోయాయి. రైతులు, రైస్‌మిల్లర్లు మంత్రి ధర్మాన ప్రసాదరావును కలిసి లక్ష్యం పెంచాలని కోరారు. పౌర సరఫరాల మంత్రి కె.నాగేశ్వరరావుతో మాట్లాడిన తర్వాత మరో 70 వేల టన్నులకు అనుమతిచ్చారు. దీంతో ధాన్యం లక్ష్యం 5.08 లక్షల మెట్రిక్ టన్నులకు చేరింది. లక్ష్యం పూర్తి కావడంతో ఫిబ్రవరి 27 ప్రభుత్వం కొనుగోళ్లను ఆపేసింది.

### అదనంగా 50 వేల టన్నులకు అనుమతి

ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను ప్రభుత్వం వీలైనంత తొందరగా ముగించేందుకు సిద్ధమైంది. ఫిబ్రవరి నెలాఖరుతో ఆపేయాలని చూసింది. జిల్లాలో పొందూరు, జి.సిగడాం, ఆమదాలవలస, బూర్జ, కోటబొమ్మాళి, పోలాకి, జలుమూరు, గార తదితర మండలాల్లో అపరాల సాగుతో ఆలస్యంగా నూర్పులు చేశారు. దీంతో వారంతా ధాన్యం అమ్ముకోలేకపోయారు. లక్ష్యం పూర్తయిందనే పేరుతో ఆర్‌బికె సిబ్బంది రైతుల నుంచి ధాన్యం తీసుకునేందుకు నిరాకరించారు. రైతుల్లో నెలకొన్న ఆందోళనలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం మరో 50వేల టన్నులను అదనంగా కొనుగోలు చేసేందుకు అంగీకరించింది.

### ఇప్పటివరకు 5.26 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు

ప్రభుత్వం తొలుత 4.38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని నిర్ణయించింది. రెండు దఫాలుగా ఇచ్చిన అనుమతులతో లక్ష్యం 5.58 లక్షల మెట్రిక్ టన్నులకు చేరింది. ఇప్పటివరకు 5.26 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇంకా 32 వేల టన్నుల వరకు కొనుగోలు చేయనున్నారు.

### జలుమూరులో అత్యధికం... కవిటిలో అత్యల్పం

జిల్లాలోని 30 మండలాల పరిధిలో ధాన్యం కొనుగోళ్లకు 744 ఆర్‌బికెలను ఏర్పాటు చేయగా 619 కేంద్రాలు ధాన్యం కొనుగోలులో భాగస్వామ్యమయ్యాయి. జిల్లాలో అత్యధికంగా జలుమూరు మండలంలో ధాన్యం కొన్నారు. ఇక్కడ 6,290 మంది రైతుల నుంచి 30,264 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఆ తర్వాతి స్థానంలో నందిగాం మండలం ఉంది. ఇక్కడ 6,176 మంది రైతుల నుంచి 27,669 టన్నుల ధాన్యం కొన్నారు. కొనుగోళ్లలో నరసన్నపేట మూడో స్థానంలో ఉంది. ఇక్కడ 5,722 మంది రైతుల నుంచి 27,188 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ధాన్యం కొనుగోళ్లలో కవిటి చిట్టచివరి స్థానంలో ఉంది. మండలంలో 623 మంది రైతుల నుంచి 2,640 మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నారు.

### దళారులకు అమ్ముకోవాల్సిందేనా?

ప్రభుత్వం గత నెల 27వ తేదీన ధాన్యం కొనుగోళ్లు ఆపేసిన నాటికి జిల్లాలోని రైతుల వద్ద సుమారు రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉండిపోయింది. ప్రభుత్వం ఈనెల 17న 50 వేల టన్నులకు అనుమతిచ్చింది. ధాన్యం కొనుగోళ్లకు ఆలస్యంగా అనుమతివ్వడంతో రైతులు తమ ధాన్యాన్ని దళారులు, వ్యాపారులకు తక్కువ రేటుకే అమ్ముకున్నారు. బస్తాను రూ.1300 నుంచి రూ.1400కే ఇచ్చేశారు. ఈవిధంగా జిల్లావ్యాప్తంగా సుమారు 50 వేల టన్నుల వరకు బయట వ్యాపారులకు అమ్ముకున్నట్లు తెలిసింది. దీంతో రైతుల వద్ద మరో లక్ష మెట్రిక్ టన్నుల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. రైతుల వద్ద ఉన్న ధాన్యంపై ప్రభుత్వం ఏం నిర్ణయం తీసుకోనుందో అన్నది చూడాల్సి ఉంది.

### ఈనెల 30 వరకు కొనుగోలు చేస్తాం

రైతుల నుంచి ఈనెల 30వ తేదీ వరకు ధాన్యం కొనుగోలు చేస్తాం. అపరాల సాగుతో జిల్లాలోని కొన్ని మండలాల్లో రైతుల వద్ద ధాన్యం నిల్వలు ఉండిపోయాయి. ఈ అంశాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని 50 వేల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోళ్లకు అనుమతులు ఇచ్చింది. ప్రతి రైతు నుంచి ధాన్యం కొంటాం. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

**- పి.జయంతి,**
**మేనేజర్, జిల్లా పౌర సరఫరాల సంస్థ**

# ఆశావర్కర్ల ఆందోళన

- సమస్యల పరిష్కారానికి డిమాండ్
- డిఎంహెచ్‌ఒ కార్యాలయం వద్ద మహాధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కనీస వేతనాలు ఇవ్వాలని, పిఎఫ్, గ్రాట్యుటీ, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, పనిభారాన్ని తగ్గించాలని, వెయ్యి జనాభాకు ఒక ఆశా వర్కర్‌ను నియమించాలని తదితర సమస్యల పరిష్కారం కోరుతూ ఆశావర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన ఆశావర్కర్లు ఆందోళన చేపట్టారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం వద్ద మంగళవారం మహాధర్నా నిర్వహించారు. పోలీసు నిర్బంధాన్ని లెక్కచేయకుండా జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చిన ఆశావర్కర్లు సమస్యలు పరిష్కరించాలని నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.నాగమణి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.ధనలక్ష్మి, జి.అమరావతి, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశావర్కర్ల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. 60 ఏళ్లు దాటిన ఆశాలను 2019 నుంచి రాష్ట్ర ప్రభుత్వం రిటైర్మెంట్ చేస్తోందని, ఇతర ఏ రాష్ట్రంలోనూ ఈ పద్ధతి లేదన్నారు.

రిటైర్మెంట్ అయిన ఆశా కుటుంబాల్లో అర్హులైన వారికి అవకాశం కల్పించాలని కోరారు. ఆశాలపై రాజకీయ జోక్యం నివారించాలని, అక్రమ తొలగింపులు, వేధింపులు ఆపాలన్నారు. సచివాలయం పేరుతో పట్టణ ప్రాంతాల్లో రెండు వేల నుంచి ఏడు వేల వరకు, సచివాలయం పరిధిలోని అన్ని గ్రామాల్లో జనాభాతో సంబంధం లేకుండా ఒక్క ఆశాకే కేటాయించి పనిభారాన్ని పెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం గ్రామాల్లో వెయ్యి నుంచి 1200, పట్టణాల్లో రెండు వేల నుంచి 2,500 జనాభాకు ఒక ఆశావర్కర్‌ని నియమించాలన్నారు. వ్యాక్సిన్ క్యారియర్లు, పిహెచ్‌సి నుంచి మందులు తీసుకురావాల్సిన బాధ్యతను ఆశాలతో చేయిస్తున్నారని చెప్పారు. సంబంధం లేని పనులు అప్పగిస్తుండడంతో, వారికి. ఇస్తున్న వేతనంలో సగానికి పైగా విధి నిర్వహణకే ఖర్చు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రికార్డుల నిర్వహణ పేరుతో పెద్దఎత్తున పుస్తకాలు కొనాల్సి వస్తోందన్నారు.

పెరిగిన ధరలకు అనుగుణంగా ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, గ్రాట్యుటీ, పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. పనిభారాన్ని తగ్గించి, సంబంధం లేని పనులు అప్పగించవద్దని కోరారు.రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, పెన్షన్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. విలేజ్ హెల్త్ క్లినిక్, సచివాలయాల డ్యూటీల నుంచి ఆశావర్కర్లను తప్పించాలని, సెలవులు మంజూరు చేయాలని కోరారు. రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, రికార్డులు ప్రభుత్వమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్స్ నియామకాల్లో రాజకీయ జోక్యం తొలగించాలన్నారు. శానిటేషన్ కమిటీల నుంచి కాకుండా ప్రభుత్వమే ప్రత్యక్షంగా నియామకాలు చేయాలన్నారు. అనంతరం జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షికి వినతిపత్రం అందజేశారు. తన పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని ఆమె హామీనిచ్చారు. ధర్నాలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు చీకటి లక్ష్మి, ఆదిలక్ష్మి జయలక్ష్మి, కాంతమ్మ, స్వాతి, లక్ష్మీపార్వతి, దమయంతి తదితరులు పాల్గొన్నారు.




శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని గాజులకొల్లివలసకు చెందిన సైకత శిల్పి గేదెల హరికృష్ణ వేసిన సైకతశిల్పం ఆకట్టుకుంది. మామిడి కాయలు, ఉగాది పచ్చడితో యువతి ఉన్న సైకతశిల్పాన్ని తిలకించిన చుట్టుపక్కల గ్రామస్తులు ఆయన్ను అభినందించారు.

**- ప్రజాశక్తి, ఆమదాలవలస**



ప్రజావేదికలో మాట్లాడుతున్న డ్వామా పీడీ చిట్టిరాజు

# మృతుల ఖాతాలకు 'ఉపాధి' చెల్లింపులు

- అధికారులపై డ్వామా పీడీ ఆగ్రహం
- షోకాజ్ నోటీసుల జారీకి ఆదేశం

ప్రజాశక్తి - పొందూరు

చనిపోయిన ఉపాధి హామీ కూలీల ఖాతాలకు చెల్లింపులు చేస్తున్న ఘటన ప్రజావేదికలో వెలుగు చూసింది. ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదికను స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. మండలంలోని 29 పంచాయతీల్లో 2021 ఏప్రిల్ 1 నుంచి 2022 మార్చి 31వ తేదీ వరకు చేపట్టిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. మండలంలోని కృష్ణాపురం, బాణాం పంచాయతీల్లో చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించి మస్టర్‌లో చనిపోయినట్లు చూపిస్తున్నా, వారి ఖాతాల్లో మాత్రం డబ్బులు జమవుతున్నాయి. సంబంధిత అధికారుల నిర్లక్ష్యంపై డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. చనిపోయిన వారి ఖాతాలకు ఎలా పేమెంట్ చేస్తారని ప్రశ్నించారు. బాధ్యులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. మస్టర్లపై సంతకాలు తీసుకోకపోయినా, తప్పుడు మస్టర్లు వేసినా క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి కూలీకి గరిష్ట కూలి రూ.257 లభించేలా పనులు కల్పించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ ఈనెల 28వ తేదీ నాటికి చెల్లింపులు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డ్వామా విజిలెన్స్ అధికారి బి.లవరాజు, సామాజిక తనిఖీ మేనేజర్ శ్రావణ్‌కుమార్, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి సురేష్, ఎంపిపి కిల్లి ఉషారాణి, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎచ్చెర్ల క్లస్టర్ ఎపిడి కె.లోకేశ్వరరావు, ఎంపిడిఒ సీపాన హరిహరరావు, ఇన్‌ఛార్జి ఎస్‌ఆర్‌పి స్వామి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, పిఎసిఎస్ చైర్మన్ కె.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# రీ సర్వేలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- లోపాలను పునరావృతం కానీయొద్దు
- జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో చేపడుతున్న సమగ్ర భూ రీ సర్వే పనులను సక్రమంగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రెండో విడత రీ సర్వే పనులపై అధికారులతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రీ సర్వేలో నిర్లక్ష్యం తగదన్నారు. కొన్ని మండలాల్లో సర్వే పనుల్లో ఎందుకు జాప్యమవుతుందో అర్థం కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు చేపట్టిన రీసర్వే పనుల్లో మండలాల వారీగా ఎంతమేరకు పూర్తి చేశారో చెప్పాలని ఎడి ప్రభాకరరావును ఆదేశించారు. సర్వే సమయంలో భూ హక్కుదారులను పిలవకుండా చేయడం వల్ల అపోహలకు దారితీస్తుందన్నారు. గ్రామ సచివాలయం పరిదిలో సర్వే చేపడుతున్నప్పుడు విఆర్‌ఒ, సర్వే అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. మొదటి విడత సర్వే శతశాతం పూర్తి చేసిన సిబ్బంది గతంలో ఎదురైన సమస్యలను పునరావృతం కాకుండా రెండో విడత రీ సర్వే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. జిల్లాలో చేపడుతున్న రెండో విడత రీ సర్వే పనులు మరింత వేగవంతం కావాలన్నారు. ఇప్పటివరకు చేపట్టిన రీ సర్వేలోని అవకతవకలను మరోమారు పరిశీలించుకుని నాలుగు రోజుల్లో సరిచేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు చేపట్టిన రీ సర్వేలో ఉన్న లోటుపాట్లను గమనించి ఇకపై ఎటువంటి లోపాలు తలెత్తకుండా ఉండేలా చూసుకోవాలని హెచ్చరించారు. రీ సర్వే పనులు నత్తనడకన నడుస్తున్న మండలాల్లో సర్వేయర్లు వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. పాసుపుస్తకాల జారీ, స్టోన్ ప్లాంటేషన్ పనులను వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో మండల సర్వేయర్లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవీన్

# నేడు ఉగాది వేడుకలు

## కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలను బుధవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ, సాంస్కృతిక, పర్యాటక, యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యాన నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ఉదయం పది గంటలకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ వేడుకల్లో పంచాంగ శ్రవణం, కవితలు, ఉగాది పచ్చడి వంటి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఉగాది వేడుకల్లో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### ప్రముఖుల ఉగాది శుభాకాంక్షలు

జిల్లా ప్రజలకు శోభకృత్ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలను కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఒక ప్రకటనలో తెలిపారు. శోభకృత్ అంటే శోభను కలిగించేదని, ఈ ఏడాదంతా జిల్లా ప్రజలకు అన్ని శుభాలు కలగాలని, సుఖసంతోషాలతో, ఆరోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. షడ్రుచుల ఉగాదితో సిరిసంపదలు, ఆనందాలు వెల్లివిరియాలని పేర్కొన్నారు. ప్రకృతిలో కలిగే మార్పుకు సంకేతంగా ఉగాది జరుపుకుంటామని తెలిపారు.శోభకృత్ నామ సంవత్సరంలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, పల్లెల్లో, పట్టణాల్లో ప్రతి ఇళ్లు కళ కళలాడాలని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. చీకట్లు తొలగిపోయి అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే నవోదయం రావాలన్నారు.

# రేపు భగత్‌సింగ్ వర్ధంతి సభ

**శ్రీకాకుళం :** స్వాతంత్ర్య పోరాట యోధుడు భగత్‌సింగ్ వర్ధంతి సభను ఈనెల 23వ తేదీన సిపిఎం జిల్లా కార్యాలయంలో ఉదయం పది గంటలకు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ సభ్యులు, సానుభూతిపరులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



విద్యార్థులకు రాగి జావను అందిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

# 'గోరుముద్ద'లో రాగి జావ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జగనన్న గోరుముద్ద భాగంగా రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి వర్చువల్ విధానంలో తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి హాజరైన కలెక్టర్ శ్రీకేష లాఠకర్ మాట్లాడుతూ జిల్లాలో 2,572 పాఠశాలలు ఉండగా అందులో 1,77,664 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజన పథకాన్ని వినియోగించుకుంటున్నారని తెలిపారు. బెల్లం కలిపిన రాగి జావను చేర్చడం వల్ల విద్యార్థుల్లో ఐరన్, కాల్షియం కలిగి రక్తహీనత లేకుండా ఉండేందుకు దోహదపడుతుందన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు పోషకాహారాన్ని అందజేస్తోందన్నారు. ప్రభుత్వం అనంతరం మున్సిపల్ స్కూల్ చిన్నారులకు రాగి జావను కలెక్టర్ పంపిణీ చేశారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ, సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయకర్త ఆర్.జయప్రకాష్, శ్రీకాకుళం శ్రీసత్యసాయి ట్రస్ట్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అధికార అహంతోనే దాడులు

## టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అధికార అహంతో వైసిపి ఎమ్మెల్యేలు శాసనసభలో టిడిపి ఎమ్మెల్యేలపై దాడులకు దిగుతున్నారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ఆరోపించారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత ఎమ్మెల్యేపై శాసనసభలో దాడి చేయడం దేశ చరిత్రలో ఏ శాసనసభలోనూ ఇంతవరకు జరగలేదన్నారు. శాసనసభ కౌరవ సభను తలపించిందన్నారు. నాటి కౌరవ సభలో ధృతరాష్ట్రుని పాత్రను స్పీకర్ తమ్మినేని సీతారాం పోషించారని విమర్శించారు. స్పీకర్ స్థానంలో ఉన్న ఆయన సొంత పార్టీ, పదవిపై ఆపేక్షతో దాడిని ఆపలేకపోయారని చెప్పారు. స్పీకర్‌లో నిజాయతీ ఉంటే శాసనసభలో ఏం జరిగిందో వీడియో బయట పెట్టాలన్నారు. టిడిపి సభ్యులపై దాడి చేసిన వైసిపి ఎమ్మెల్యేల సభ్యత్వాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బలం ఉందని బల ప్రయోగం చేసిన వైసిపి నాయకులకు తమిళనాడులో కరుణానిధి ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందన్నారు. మూడు రాజధానులపై వైసిపి మంత్రులకే స్పష్టత లేదన్నారు. యాదవులపై తన వ్యాఖ్యలను వక్రీకరించారని చెప్పారు. తన వ్యాఖ్యల వల్ల వారి మనోభావాలు దెబ్బతింటే తాను బహిరంగ క్షమాపణ చెప్పేందుకు సిద్ధమన్నారు. ఐప్యాక్ ఆడుతున్న మైండ్ గేమ్‌లో భాగంగా అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె బాబు, తోణంగి వెంకన్న యాదవ్, చిట్టి మోహన్. తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింతు సుధాకర్. ప్రధాన విజయరాం, జామి భీమశంకర్, కలగ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కూన రవికుమార్

# డిటిసిగా రాజారత్నం

**శ్రీకాకుళం ప్రతినిధి :** శ్రీకాకుళం డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా రాజారత్నం మంగళవారం పూర్తి అదనపు బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటివరకు విశాఖపట్నం డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌గా పనిచేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి జి.ఆర్ రాధికను మర్యాదపూర్వకంగా కలిశారు.

### పోలీసు కుటుంబాలకు ఆర్థికసాయం

మరణించిన పోలీసు ఉద్యోగుల కుటుంబసభ్యులకు ప్రభుత్వం ఇచ్చిన ఆర్థికసాయాన్ని ఎస్‌పి జి.ఆర్ రాధిక అందించారు. నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో మృతి చెందిన ఉద్యోగి కుటుంబసభ్యులకు ప్రభుత్వం నుంచి మంజూరైన కార్పస్ ఫండ్ నుంచి ఒక్కో కుటుంబానికి రూ.లక్ష చొప్పున మంగళవారం అందజేశారు. అనారోగ్యంతో మరణించిన కానిస్టేబుల్ కె.వి రామకృష్ణ, చుక్కారావు, అప్పలనాయుడు రహదారి ప్రమాదంలో మృతి చెందిన ఎస్.మల్లేశ్వరరావు కుటుంబసభ్యులకు చెక్కులను ఇచ్చారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాజారత్నం


బహుమతిని అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

## ఎమ్మెల్సీ 'నర్తు'కు శుభాకాంక్షలు

**ప్రజాశక్తి- కవిటి**

స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన నర్తు రామారావుకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. నియోజకర్గంలోని నాయకులతో పాటు అధికారులు, ఉద్యోగులు, జిల్లా వ్యాప్తంగా ఉన్న యాదవ సామాజిక తరగతి రామారావును కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. అందులో భాగంగా ఇచ్ఛాపురం నియోజకవర్గానికి చెందిన ఎపివిడబ్ల్యుఎస్‌జిఇఎ (సచివాలయం) సిబ్బంది, బెంతు ఒరియా కుల పెద్దలు మంగళవారం రామారావును తన స్వగ్రామం కొత్తపుట్టుగలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ సచివాలయం వ్యవస్థ అనేది ముఖ్యమంత్రి మానసిక పుత్రికని, సచివాలయం సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహిస్తూ ప్రభుత్వ పథకాలు పూర్తిస్థాయిలో అమలయ్యేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ దేవరాజ్ సాహు, తలతంపర సర్పంచ్ జగబందు దొలై, వరక, కుసుంపురం సర్పంచ్ ప్రతినిధులు శ్రీకాంత్ పురియా, శివ బిశాయి, సంతోష్, ఎపివిడబ్ల్యుఎస్‌జిఇఎ టెక్కలి, పలాస డివిజన్ కో-ఆర్డినేటర్ పొల్లాయి అశోక్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ జయకృష్ణ, ఇచ్ఛాపురం, కంచిలి మండలాల అధ్యక్షులు హరిచంద్ర, కె.వాసు, కోటేష్, లోళ్ల విజయ్, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.


శృతి తయారు చేసిన ప్రాజెక్టు

## ఇన్‌స్పైర్‌కు సైన్స్ ప్రాజెక్టు ఎంపిక

**నందిగాం:** మండలంలోని లఖిదాస్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వంకల శృతి రూపొందించిన ఏ ప్రీపెయిడ్ వాటర్ మీటర్ యూజింగ్ స్మార్ట్ కార్డ్ అనే అంశంపై ప్రాజెక్టుకు రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్‌కు ఎంపికైందని ప్రధానోపాధ్యాయులు చిలుకు కృష్ణారావు మంగళవారం తెలిపారు. ఇటీవల జిల్లాస్థాయిలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికు అర్హత సాధించిందన్నారు. ఈ నెల 24న విజయవాడలో ఎంపికైన ప్రాజెక్టుతో ప్రదర్శనలో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థికి గ్రామ సర్పంచ్ బొంగి అమ్ములమ్మ, ఉపాధ్యాయులు తులసీప్రసాద్, విద్యా కమిటీ చైర్మన్ పిరియా ధర్మారావు, ఆర్.రామారావు, బి.రత్నం, త్రినాథరావు అభినందించారు.

## 'ఉపాధి' పనులు పరిశీలన

**సోంపేట:** మండలంలోని పలాసపురంలో చేపడుతున్న ఉపాధి పనులను సర్పంచ్ తడక జోగారావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి పనుల వద్ద కూలీలకు అందజేస్తున్న సౌకర్యాలను గురించి అడిగి తెలుసుకున్నారు. కూలీలకు కూలి పెరిగేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ శ్రీను, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# రాగిజావతో ఆరోగ్యం

**ప్రజాశక్తి- ఆమదాలవలస**

ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం అందించే ఉద్దేశంతో చేపడుతున్న జగనన్న గోరుముద్ద పథకంనకు అదనంగా రాగిజావను పంపిణీ చేస్తున్నట్లు మండల విద్యా సంక్షేమ అధికారి, ఎపిఎం పైడి కూర్మారావు తెలిపారు. ఇందులో భాగంగా శ్రీనివాసాచార్యులపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు బైరెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యాన రాగి జావ పంపిణీ ప్రారంభించారు. ఇందులో భాగంగా విద్యార్థినీ విద్యార్థులకు మాజీ ప్రాదేశిక సభ్యులు గురుగుబెల్లి ప్రభాకరరావు స్టీలు గ్లాసులు తన సొంత నిధుల నుంచి కొనుగోలు చేసి పంపిణీ చేశారు.

మండలంలోని తొగరాం జెడ్‌పి జిల్లా పరిషత్ పాఠశాలలో జెడ్‌పిటిసి బెండి గోవిందరావు రాగిజావను ప్రారంభించారు. అనంతరం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే విద్యార్థులకు అట్టలు, పెన్ను, పెన్సిల్ పది వస్తువులతో కూడిన కిట్లను అందజేశారు. సైన్స్ డేలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, ఎంపిడిఒ ఎం.రేణుక, ఎంఇఒ దుప్పల రామారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.కృష్ణ, విద్యా కమిటీ చైర్మన్ కె.రాఘవాచార్యులు పాల్గొన్నారు.

**కవిటి:** రాగిజావతో చిన్నారులకు విలువైన పోషకాలంది ఆరోగ్యం మెరుగుపడుతుందని దూగానపుట్టుగ సర్పంచ్ డి.భద్రాచలం అన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంగళవారం రాగి జావా అందించారు. కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ పూడి లక్ష్మణరావు, బొరివంకలో సర్పంచ్ శ్రీరామ్‌ప్రసాద్, మాణిక్యపురంలో పిఎసిఎస్ చైర్మన్ దేవరాజ్ సాహూ, డి.గొనపపుట్టుగలో సర్పంచ్ బి.కిరణ కుమారి రాగిజావను పంపిణీ చేశారు.

**వజ్రపుకొత్తూరు :** మండలంలోని పల్లిసారథి జిల్లా పరిషత్ పాఠశాలలో ఎంపిపి ఉప్పరపల్లి నీలవేణి, గోవిందపురం ప్రాథమిక పాఠశాలలో వైసిపి యువ నాయకులు పాలిన ఉమామహేశ్వరరావు, వజ్రపుకొత్తూరు జిల్లా పరిషత్ పాఠశాలలో వైసిపి మండల పార్టీ అధ్యక్షులు పుక్కల్లా గురయ్యనాయుడు, ఉద్దానం రామకృష్ణాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో సర్పంచ్ చింత హేమారావు, బెండి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సర్పంచ్ హనుమంతు వెంకటరావు, కిరిసింగి ప్రాథమిక పాఠశాలలో రాగిజావను ప్రారంభించారు.

**టెక్కలి రూరల్ :** మండలంలోని సీతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఇఒ డి.నాగభూషణరావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిటిసి బెండి దేవయాని, ప్రధానోపాధ్యాయులు సత్తారు వేణుకూమారి పాల్గొన్నారు.

**సంతబొమ్మాళి :** మండలంలోని జగన్నాథపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సర్పంచ్ జోగి రాములమ్మ, నరసాపురంలో సర్పంచ్ దుక్క భూషణరెడ్డి, ఉమిలాడలో పిఎసిఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, బోరుభద్రలో సర్పంచ్ బుస్కల లక్ష్మీకాంతం, సంతబొమ్మాళిలో సర్పంచ్ కళింగపట్నం లక్ష్మి, పాతమేఘవరంలో సర్పంచ్ పరపటి సునీతారెడ్డి, మరువాడలో సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి, వైసిపి ఇన్‌ఛార్జి గంట ఈశ్వరరావు, సూరాడవానిపేటలో పిఎంసి చైర్మన్ సూరాడ జోగారావు, కారిపేటలో సర్పంచ్ ప్రతినిధి సూరాడ వెంకటేష్ ప్రారంభించారు.


ఆమదాలవలస : గ్లాసులను పంపిణీ చేస్తున్న ప్రభాకరరావు

**నందిగాం:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6 నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సర్పంచ్ ప్రతినిధి జె.జయరామ్ రాగిజావను అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.హరిబాబు, పాఠశాల కమిటీ చైర్మన్ సనపల చిన్నారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఇచ్ఛాపురం :** మున్సిపల్ ప్రాథమిక ఈదుపురం, పురుషోత్తపురం, రత్తకన్న పాఠశాలల్లో చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, వైస్ ఎంపిపి దువ్వ వివేకానంద, శాసనం పాఠశాలలో ఎంపిపి బోర పుష్పలత, బెల్లుపడ కాలనీలో ఎంఇఒ అప్పారావులు రాగిజావను ప్రారంభించారు.

**కోటబొమ్మాళి:** మండలంలోని లఖందిడ్డిలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరావు, కోటబొమ్మాళిలో సర్పంచ్ బమ్మిడి గణపతిస్వామి, చిన్నపొందరవీధిలోని బాలికల పాఠశాలల్లో సర్పంచ్ కాళ్ల సంజీవరావులు రాగిజావను ప్రారంభించారు.

**బూర్జ :** మండలంలోని కొండపేట ప్రాథమిక పాఠశాలలో ఎంపిపి కర్నేన దీప, జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావులు రాగిజావను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కె.నాగేశ్వరరావు, ఎంపిడిఒ రవీంద్రబాబు, సర్పంచ్ వి.విజయలక్ష్మి, పి.బాబూరావు, బి.నారాయణరావు, ఎం.ఎస్.మణి, స్వామినాయుడు, పరమేశ్వరరావు పాల్గొన్నారు. ఓ.విపేటలో వైస్ ఎంపిపి బుడుమూరు సూర్యారావు, హెచ్‌ఎం చింతాడ నారాయణస్వామి, సర్పంచ్ మెట్ట అమ్మాజమ్మలు రాగిజావను ప్రారంభించారు.


కోటబొమ్మాళి : ప్రారంభిస్తున్న ఎంపిపి ఉమామల్లేశ్వరరావు


రణస్థలం : రాగిజావను పంపిణీ చేస్తున్న ఫణికుమార్


సంతబొమ్మాళి : ప్రారంభిస్తున్న సర్పంచ్ రాములమ్మ

**రణస్థలం :** ప్రతి పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులకు గోరుముద్దలో భాగంగా రాగిజావను ప్రభుత్వం అందజేస్తుందని వైసిపి మూడు జిల్లాల విద్యార్థి విభాగం జోనల్ ఇన్‌ఛార్జి వడ్డాది ఫణికుమార్ అన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఆదర్శ పాఠశాలలో రాగిజావను ప్రారంభించి పిల్లలకు అందించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పిన్నింటి గౌరినాయుడు, మోడల్ స్కూల్ ఆదర్శ కళాశాల చైర్మన్ బ్రహ్మాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**మెళియాపుట్టి :** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఇఒ ఎస్.దేవేందరరావు, ఎస్ఐ టి.రాజేష్‌లు రాగిజావను ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు యు.గణపతిరావు, సర్పంచ్ ప్రతినిధి ఆర్.వాసు, ఎంపిటిసి ప్రతినిధి జై.మునిరావు పాల్గొన్నారు.

**జలుమూరు:** మండలంలోని తిమడాం, జలుమూరు ఉన్నత పాఠశాలలో డిప్యూటీ డిఇఒ తిరుమల చైతన్య పాగోడు ఉన్నత పాఠశాలలో సర్పంచ్ దామ మన్మథరావులు రాగిజావను ప్రారంభించారు.


పొందూరు : బహుమతులను అందజేస్తున్న రాజు

# ప్రశాంతంగా ప్రజ్ఞా వికాస పరీక్ష

**ప్రజాశక్తి- పొందూరు**

మండలంలోని మానసవేణి కాన్వెంట్ స్కూల్ విద్యార్థులు మంగళవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన ప్రజ్ఞా వికాస పరీక్షలను నిర్వాహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు చిత్తిరి రాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు, దృక్పథాలను పెంపొందించడంలో ఇటువంటి పరీక్షలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అలాగే సమాజంపై అవగాహన కలిగే విధంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన స్టడీ సర్కిల్, తరగతులను నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల్లో పరీక్షలపై ఉండే భయాన్ని తొలగించవచ్చునని పేర్కొన్నారు. అనంతరం ప్రజ్ఞా పరీక్షల్లో ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కుమార్, ఎస్‌ఎఫ్‌ఐ మండల కమిటీ సభ్యులు గణేష్, సంధ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### విజేతలకు బహుమతులు అందజేత

**కొత్తూరు :** ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన ఇటీవల నిర్వహించిన మండల స్థాయి ప్రజ్ఞా వికాస్ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందిన విద్యార్థులకు హోలీక్రాస్ ఉన్నత పాఠశాలలో బహుమతులను ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు బి.హరీష్, డి.చంద్రశేఖర్‌లు అందజేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న డి.కగేశ్వరి ప్రథమ, హోలీక్రాస్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పాలవలస అభిలాష్ ద్వితీయ, బి.మహేష్‌లు తృతీయ స్థానాల్లో నిలిచారు.


కొత్తూరు : బహుమతులను అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

## రోడ్డు ప్రమాదంలో పారిశుధ్య కార్మికురాలు మృతి

**కొత్తూరు :** మండలంలోని రామకృష్ణాపురానికి చెందిన లిమ్మక సావిత్రి (52) మంగళవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు... సోమవారం మహార్తాపురంలో ఉన్న తన చెల్లెలు ఇంటికి వెళ్లింది. మంగళవారం ఉదయం ఆటోలో స్వగ్రామానికి వస్తుంది. మార్గమధ్యంలో ఆటో నుంచి జారిపడి తీవ్రంగా గాయపడింది. వెంటనే స్థానికులు కొత్తూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం జిల్లా సర్వజనాస్పత్రికి రిఫర్ చేశారు. మార్గమధ్యంలో పరిస్థితి విషమించి మృత్యువాత పడింది. మృతురాలు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో పారిశుధ్య కార్మికురాలుగా పనిచేస్తుంది. భర్త గౌరీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సి వి.కాంతారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.


రక్తదానం చేస్తున్న యువకులు

## డివైఎఫ్‌ఐ రక్తదాన శిబిరం

**ప్రజాశక్తి- కంచిలి**

ఈ నెల 23న భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవుల 92వ వర్ధంతిని పురస్కరించుకుని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య ఆధ్వర్యాన మండలంలోని పి.శాసనంలో ప్రాణదాత బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో మంగళవారం ఉచిత రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ మేరకు 12 మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారని సమాఖ్య పూర్వ అధ్యక్షులు ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. ప్రతిఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానంపై ఎటువంటి అపోహలు పడవద్దని సూచించారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కె.గోపి, ఎ.లోకనాథం, వేణు, ఈశ్వర్, హేమరాజు, కె.పద్మారావు, లక్ష్మణ్, వినోద్, కుర్మారావు పాల్గొన్నారు.

# స్పీకర్‌ను అవమానించడం తగదు

## కళింగ కార్పొరేషన్ చైర్మన్ తిలక్


మాట్లాడుతున్న తిలక్

**శ్రీకాకుళం అర్బన్ :** శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంను ఉద్దేశపూర్వకంగా, వ్యక్తిగతంగా టార్గెట్ చేసి అణగదొక్కాలని టిడిపి ప్రయత్నిస్తోందని కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ ఆరోపించారు. నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రాజకీయ చైతన్యం కలిగిన కళింగ సామాజిక తరగతికి చెందిన తమ్మినేనిపై చంద్రబాబు, అచ్చెన్నాయుడు కక్షగట్టారని ఆరోపించారు. తమ్మినేనిపై ఉద్దేశపూర్వకంగా దాడి చేసే ప్రయత్నం చేస్తే కాళింగుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఆమదాలవలస, ఇచ్ఛాపురం మినహా జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో టిడిపిలో అచ్చెన్నాయుడు వర్గాలను ప్రోత్సహిస్తూ... రాష్ట్రంలో టిడిపిని భూస్థాపితం చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు శరవేగంగా జరుగుతున్నా పనులు నిలిచిపోయినట్టు అచ్చెన్నాయుడు శాసనసభలో మాట్లాడడం సరికాదన్నారు. భావనపాడు పోర్టుకు భూసేకరణ పూర్తిచేసి పనులు ప్రారంభించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రూ.5 కోట్లతో విత్తనాభివృద్ధి సంస్థను కేటాయించారని తెలిపారు. సమావేశంలో వైసిపి ఎంపిపిలు మొదలవలస చిరంజీవి, నడుపూరు శ్రీరామ్మూర్తి, పలాస మన్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, కిల్లి వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.


శ్రీకాకుళం : మొక్కకు నీరు పోస్తున్న డిఇఒ పగడాలమ్మ

# అడవుల రక్షణ అందరి బాధ్యత

**శ్రీకాకుళం :** ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా నగరంలోని జిజిహెచ్‌ఎస్ జిల్లా పరిషత్ ఆవరణలో డిఇఒ గార పగడాలమ్మ మంగళవారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృక్షో రక్షిత రక్షిత్ణ అని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలను పెంచి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. అడవుల ఆవశ్యకత గూర్చి సమాజంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు చైతన్యం తేవాలని సూచించారు. అడవుల నరికివేత వల్ల అనేక పర్యావరణ సమస్యలు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎన్‌జిసి జిల్లా కో-ఆర్డినేటర్ ఉమామహేశ్వరి, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు గోవిందరావు, మోషే, ఫారెస్టు అధికార్లు జగదీశవరరావు, నిహారిక, ప్రధానోపాధ్యాయులు వాగ్దేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**సంతబొమ్మాళి:** ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బోరుభద్ర ఆవరణలో నేషనల్ గ్రీన్ కోర్ క్లస్టర్ కో-ఆర్డినేటర్ తాడేల లోకేశ్వరరావు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.వి.రమణమూర్తి మాట్లాడుతూ మొక్కలు ప్రాణదాతలని, అడవులను రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో నేషనల్ గ్రీన్ కోర్ క్లస్టర్ కో ఆర్డినేటర్ తాడేల లోకేశ్వరరావు, సర్పంచ్ బుసకల లక్ష్మీకాంతం, గ్రామ పెద్ద లక్ష్మయ్య, ఎన్‌జిసి క్లస్టర్ కో-ఆర్డినేటర్ టి.లోకేశ్వరరావు, గ్రీన్‌టీచర్ డి.ఉమాశంకర్, ఉపాధ్యాయులు పి.తిరుపతిరావు, బి.తాతారావు, ఎ.వెంకటరెడ్డి, బి.లక్ష్మణరావు, పి.ఎర్రయ్య, కె.త్రినాథరావు, బాడాన రాజు, ఉమాదేవి పాల్గొన్నారు.

**పొందూరు :** మండలంలోని లోలుగు కెజిబివిలో ప్రిన్సిపాల్ ఆర్.సౌమ్య, తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు లఖినాన హేమనాచార్యులు ఆధ్వర్యాన అటవీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అడవుల ప్రాముఖ్యతను తెలియజేయడంతో పాటు పలు పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్ఫూర్తి పోలీస్ కళా బృందం పాల్గొన్నారు.


సంతబొమ్మాళి : మొక్కను నాటుతున్న ఉపాధ్యాయులు


పొందూరు:మొక్కను నాటుతున్న హెచ్‌ఎం హేమనాచార్యులు

# ఆదర్శప్రాయులు 'అప్పారి'

**ప్రజాశక్తి- రణస్థలం**

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) రాష్ట్ర వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి సేవలు భవిష్యత్ తరాలకు ఆదర్శనీయమని, ఆయన ఆశయాలను కొనసాగించడమే యుటిఎఫ్ ప్రధాన కర్తవ్యంగా పనిచేస్తోందని యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.కోదండరామయ్య, టి.శంకరరావు అన్నారు. స్థానిక ఎంఇఒ కార్యాలయంలో వెంకటస్వామి వర్ధంతి సభ మంగళవారం నిర్వహించారు. ముందుగా వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవిఎస్ ఆదర్శాలే మనకు స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన తుది శ్వాస వరకు సామాజిక స్పృహతో పనిచేశారని తెలిపారు. సరళీకృత ఆర్థిక విధానాలు, ప్రపంచీకరణ ఫలితాల కారణంగా విద్యా రంగం కార్పొరేటీకరణ దిశగా వెళ్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులపై భారంగా ఉన్న యాప్ విధులు ఉప సంహరించాలన్నారు. 3, 4, 5 తరగతుల విలీనాన్ని ఉపసంహరించుకోవాలని, సిపిఎస్ రద్దు తదితర అంశాలపైన ఉద్యమ కార్యాచరణ అమలు చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఇఒ ఎ.త్రినాథరావు, యుటిఎఫ్ కౌన్సిల్ సభ్యులు బి.రమేష్, డి.రామారావు, కె.లింగరాజు పాల్గొన్నారు.


చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

# టిడిపి పూర్వ వైభవానికి కృషి

**కోటబొమ్మాళి:** తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్సీ ఎన్నికలవలే కష్టపడి పనిచేస్తే వస్తున్న ఎన్నికల్లో మనమే విజయం సాధిస్తామని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని నిమ్మాడ తన క్యాంపు కార్యాలయంలో ఉన్నారని తెలుసుకున్న టిడిపి నాయకులు జిల్లా నలుమూలల నుంచి వచ్చి అచ్చెన్నాయుడును మర్యాదపూర్వకంగా మంగళవారం కలిసి దుశ్శాలువ కప్పి సన్మానించారు. టిడిపి పూర్వ వైభవానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, మండల పార్టీ అధ్యక్షులు బోయిన రమేష్, మాజీ ఎంపీపీ తర్ర రామకృష్ణ, వెలమల కామేశ్వరరావు, ఎస్.శ్రీనివాస్, టెక్కలి నియోజకవర్గ మహిళా అధ్యక్షులు పూజారి శైలజ పాల్గొన్నారు.


టిడిపిలోకి ఆహ్వానిస్తున్న అచ్చెన్నాయుడు

### పలువురి చేరిక

టెక్కలి మండలం బన్నువాడ పంచాయతీ మోదుగువలసకు చెందిన వైసిపి నాయకులు బసవల మోహనరావు, తమిరి షణ్ముఖరావు, పోలాకి తిరుపతిరావు, శ్రీరాములు, హనుమంతు కృష్ణ, బసవల భీష్మారావు, పోలాకి సంపతిరావులను నిమ్మాడ తన క్యాంపు కార్యాలయంలో అచ్చెన్న సమక్షంలో టిడిపి తీర్థం పుచుకున్నారు.

## దరఖాస్తులకు ఆహ్వానం

**ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్**

జిల్లాలో క్రీడల్లో రాణిస్తున్న వారిని ప్రోత్సహించేందుకు ఆయిల్ అండ్ నేచరల్ గ్యాస్ కార్పొరేషన్ (ఒఎన్‌జిసి) సంస్థ ఉపకార వేతనాలను అందజేస్తున్నామని సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. అందుకోసం ఈ నెల 27లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపిన యువ క్రీడాకారులు 2023-24 ఆర్థిక సంవత్సరానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు https://sportsscholarship.ongc.co.in అనే వెబ్‌సైట్ ద్వారా అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఒఎన్‌జిసి అధికారిని సంప్రదించాలన్నారు.

## విద్యార్థులపై కపట ప్రేమ

**ప్రజాశక్తి- ఆమదాలవలస**

విద్యార్థులపై ప్రభుత్వం కపట ప్రేమ చూపుతుందని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు విమర్శించారు. పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. విద్యకు పెద్దపీట వేశామని నాడు-నేడు పేరిట పాఠశాలల రూపురేఖలు మార్చామని పదే పదే గొప్పలు చెబుతున్న ప్రభుత్వం చేతల్లో మాత్రం చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. ఇటీవల ప్రభుత్వం భారీ ఎత్తున గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించి కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి పోస్టర్లను ముద్రించిందన్నారు. కానీ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు ప్రశ్నాపత్రాలను ముద్రించకుండా పరీక్షల వ్యవస్థకు తూట్లు పొడిచిందని ఎద్దేవా చేశారు.

## ఆకట్టుకున్న నీటిబిందువు ఆకారం


నీటిబిందువు ఆకారాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

**పొందూరు:** ఈనెల 22న ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా మండలంలోని తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులు ప్రదర్శించిన నీటిబిందువు ఆకారం ఆకట్టుకుంది. ప్రతి నీటిబొట్టునూ ఒడిసి పట్టుకుని పొదుపుగా వాడాలనే సందేశాన్ని ఇస్తూ విద్యార్థులు ఈ ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లఖినాన హేమనాచార్యులు, నేషనల్ గ్రీన్‌కోర్ క్లస్టర్ కో-ఆర్డినేటర్ పూజారి హరిప్రసన్న, సైన్స్ ఉపాధ్యాయులు రావాడ పాపారావు, వ్యాయామ ఉపాధ్యాయులు పైడి సునీత పాల్గొన్నారు.

## ధాన్యం డబ్బులు చెల్లించాలి

**టెక్కలి :** రైతు భరోసా కేంద్రం ద్వారా రైతుల వద్ద నుంచి తీసుకున్న ధాన్యాన్నికి డబ్బులు చెల్లించాలని బన్నువాడకు చెందిన రైతు పోలాకి సోమేశ్వరరావు కోరారు. ఈ మేరకు మంగళవారం ముందు తన ఆవేదనను వ్యక్తం చేశారు. గత నెల 4న అయోధ్యాపురం సచివాలయం ద్వారా మూడు ట్రాక్టర్ల ధాన్యాన్ని పంపానని తెలిపారు. 50 రోజులు కావస్తున్నా ఇప్పటి వరకు తన ఖాతాలో డబ్బులు జమ కాలేదని వాపోయారు. ఇదే విషయమై సచివాలయ వ్యవసాయశాఖ అసిస్టెంట్ పవన్‌ని అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని అన్నారు. ఆధార్ కార్డు అప్‌లోడ్ చేయడంలో చూపిన జాప్యం వల్ల తన ఖాతాలో డబ్బులు జమ కాలేదని చెబుతున్నారని అన్నారు. సకాలంలో డబ్బులు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి డబ్బులు చెల్లించాలని కోరారు.

# ఘనంగా 'లోతుగెడ్డ' జన్మదిన వేడుకలు




పుష్పగుచ్ఛం అందజేస్తున్న జెడ్‌పిటిసి ఉషారాణి

**ప్రజాశక్తి- కొత్తూరు**

స్థానిక బియ్యాల కళ్యాణ మండపంలో పాతపట్నం నియోజికర్గం వైసిపి నాయకులు లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా రామాలయం నుంచి మేళ తాళాలు, వాయిద్యాలు, బాణసంచా, అభిమానుల నృత్యాలతో కళ్యాణ మండపానికి చేరుకున్నారు. అనంతరం కేకును కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కొత్తూరు ఎంపిపి సవర సావిత్రి, పాతపట్నం జెడ్‌పిటిసి లింగాల ఉషారాణి, హిరమండలం ఎంపిపి ప్రతినిధి తిరుపతిరావులు పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రెండు వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కోయిలాపు సంజీవురావు, ఆర్.కన్నయ్య, సర్పంచ్‌లు కొయిలాపు శ్రీనివాసరావు, కొచాడ వెంకట రత్నమయ్య, అంపిలి ప్రశాంత్ కుమార్, భాస్కర రావు పాణిగ్రహి, లోతుగెడ్డ తాతబాబు, పడాల భూజంగరావు, చల్లా ధర్మారావు, దారపు రామకృష్ణ, వెంకట కృష్ణ, అగతముడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# సూక్ష్మపోషకాలతో ఆరోగ్యవంతమైన జీవనం


జ్యోతిప్రజ్వలన చేస్తున్న సిడిపిఒ పాపినాయుడు

**ప్రజాశక్తి- పొందూరు**

సూక్ష్మపోషకాలు కలిగిన చిరుధాన్యాల వినియోగంతో ఆరోగ్యవంతమైన జీవనం సాగించవచ్చునని సిడిపిఒ డోల పాపినాయుడు అన్నారు. పొందూరులోని గాంధీనగర్‌లో ఉన్న అంగన్వాడీ కేంద్రం-2లో మంగళవారం పోషణ పక్షోత్సవాలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిరుధాన్యాలలో సూక్ష్మపోషకాలైన ఐరన్, కాల్షియం, మెగ్నిషియం, పోటాషియం వంటి ఎక్కువగా ఉంటాయని అన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు లభించే ఇటువంటి వాటిని తీసుకోవడం వల్ల గర్భిణులు, బాలింతలు, యుక్త వయస్సు బాలికల్లో లోప భూషణను నివారించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి తమ్మినేని లక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు రమాదేవి, ఎ.అనురాధ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిపి శ్రీరామ్మూర్తి

## నీటిఎద్దడి నివారణకు చర్యలు

ప్రజాశక్తి - నందిగాం

రానున్న వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి అధికారులను కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ హెచ్.వి.రమణమూర్తి అధ్యక్షతన మండల పరిషత్ సిబ్బందితో, బోర్ మెకానిక్‌లతో, కార్యదర్శులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే మూడు నెలల్లో నీటి ఎద్దడి పరిస్థితులు ఏర్పడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. వాటర్ స్కీములు, బోర్లు మరమ్మతులకు గురైతే వెంటనే మండల పరిషత్‌లో ఏర్పాటు చేసిన స్పందనకు సమాచారం అందజేయాలన్నారు.

### 'ఉపాధి' పనులపై సమీక్ష

కూలీల కనీస కూలి అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపిపి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై అధికారులతో సమీక్షించారు. టెక్నికల్ అసిస్టెంట్లు గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లను సమన్వయ పరుచుకుని ప్రభుత్వ నిబంధనల మేరకు కనీస కూలి అందేలా చూడాలని సూచించారు. సమావేశంలో ఎంపిడిఒ హెచ్.వి.రమణమూర్తి, ఎపిఒ నాగరాజు పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న రవికుమార్

## చెత్త సంపద తయారీ కేంద్రం పరిశీలన

**పొందూరు:** మండలంలోని లైదాంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్వహణను జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్తలను సేకరించి వర్మీకంపోస్టు ఎరువుల తయారీని పరిశీలించారు. ఈయన వెంట డిపిఆర్‌సి జిల్లా సమన్వయకర్త వెంకటరాజు, రిసోర్స్‌పర్సన్ రాజేష్, సర్పంచ్ అనంత రామకృష్ణ, కార్యదర్శి సీతారాం ఉన్నారు.


బెల్లాన్ని విక్రయిస్తున్న సిబ్బంది

## ప్రకృతి సేద్యం బెల్లం విక్రయం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని చేపేనపేటలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో తయారు చేసిన స్వచ్ఛమైన బెల్లంను జిల్లా కేంద్రంలోని అపార్ట్‌మెంట్లలోని ప్రజలకు 200 కేజీల బెల్లాన్ని కొనుగోలు చేశారు. ఎటువంటి ఎరువులు, పురుగు మందులు వినియోగించకుండా రైతులు పండించిన స్వచ్ఛమైన సహజ సేద్య పద్ధతిలో తయారు చేసిన బెల్లాన్ని కొనడానికి కొనుగోలుదారులు ఆసక్తి చూపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి రేవతి మాట్లాడుతూ గ్రామాల్లో సిబ్బంది ద్వారా రైతులతో ప్రకృతి వ్యవసాయ విధానాలను పంటల్లో అవలంబించేటట్లు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అలాగే వచ్చిన పంట ఉత్పత్తులను నేరుగా వినియోగదారులు కొనేవిధంగా మార్కెటింగ్ కూడా చేస్తున్నామని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసి రైతులు పండించిన ఉత్పత్తులను కొనుగోలు చేసి రైతులకు ఆసరాగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం దృష్టికి ఇచ్ఛాపురం సమస్యలు

**ఇచ్ఛాపురం :** విజయవాడలో అసెంబ్లీ సమావేశాల్లో సందర్భంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి దృష్టికి ఇచ్ఛాపురం సమస్యలను తీసుకెళ్లామని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ భారతీదివ్య తెలిపారు. బిసి ప్రచార కార్యక్రమం ట్రైనింగ్ ప్రోగ్రామ్ కమ్యూనిటీలు సమావేశాలపై, కార్యక్రమాలపై దిశ నిర్దేశాలు చేశారని అన్నారు. ప్రతిఒక్కరూ గడపడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించాలని చెప్పారని అన్నారు. కార్యక్రమంలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీలు జంగా కృష్ణమూర్తి, వంశీకృష్ణ, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్ యాదవ్ పాల్గొన్నారు.


సిఎంతో మాట్లాడుతున్న భారతీదివ్య

# క్రమశిక్షణతో ఫలితాలు

**ఇచ్ఛాపురం :** రానున్న పదో తరగతి పరీక్షల్లో కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి అన్నారు. మున్సిపల్ హైస్కూళ్లు పురుషోత్తపురం, రత్తకన్నలో మంగళవారం నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభకి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థీ పరీక్షలు బాగా రాసి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, అలాగే పురపాలక సంఘానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్, ఎంఇఒ అప్పారావు,


ఇచ్ఛాపురం : బహుమతి అందజేస్తున్న రాజ్యలక్ష్మి

ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కౌన్సిలర్లు తాడి ఆదిరెడ్డి, జగన్నాయకులు, కౌన్సిలర్ ప్రతినిధి బొబ్బిలి నరసింహులు పాల్గొన్నారు.

**మెళియాపుట్టి :** ప్రతి విద్యార్థీ క్రమశిక్షణతో మెలగాలని పెద్దలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.వి.రమణమూర్తి అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని అన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయడానికి ఉపాధ్యాయులు నిరంతరం పాటుపడుతున్నారని అన్నారు. అనంతరం విద్యార్థులు సినిమా పాటలకు నృత్యాలు ఉత్సాహం గడిపారు. కార్యక్రమంలో పార్వతీశం, రవి, లక్ష్మీదేవి, చంద్రబాబు, బెనర్జీ, స్వామి మాస్టర్ పాల్గొన్నారు.

**పొందూరు:** మండలంలోని రాపాకలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు టి.జ్యోతి అధ్యక్షతన పాఠశాల వార్షికోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. చిన్నారులు చేసిన పలు నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి కొంచాడ గిరిబాబు, ఎంపీటీసీ సభ్యులు వండాన శ్రీదేవి, చింత రమణమ్మ పాల్గొన్నారు.

**జి.సిగడాం :** మండలంలోని సంతవురిటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంఆ విద్యార్థులు సినిమా పాటలకు డ్యాన్స్ చేశారు. అనంతరం ఉపాధ్యాయులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు టి.జయలక్ష్మి పాల్గొన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన మౌనిక, చందన, రఘుపతినాయుడులకు బహుమతులను అందజేశారు. అనంతరం వైస్ ఎంపిపి తోలేటి వెంకటరమణ రాగిజావను ప్రారంభించారు.


పొందూరు : నృత్యం చేస్తున్న విద్యార్థులు

# ఘనంగా ఉగాది సంబరాలు

ప్రజాశక్తి- రణస్థలం

మండల కేంద్రంలో రణస్థలం, లావేరు మండలాల ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యాన మంగళవారం పోషణ్ పక్వాడ వారోత్సవాలు, ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ మాట్లాడుతూ సంపూర్ణ పోషణ, తెలుగు వారి సాంప్రదాయాలకు మేళవించే ఉగాది పండుగను సంతోషంగా నిర్వహించుకోవాలన్నారు. సంపూర్ణ పోషణ అలవరుచుకోవాలన్నారు. ఉగాది సంబరాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి, వివిధ పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు, షీల్డ్‌లను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన వంటలు స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి టొంపల సీతారాం, ఎంపిటిసిల సంఘం అధ్యక్షులు మహంతి చిన్నరామునాయుడు, నాయకులు గొర్లె శ్రీనువాసరావు, ఐసిడిఎస్ పిఒ ఝాన్సీరామ్, ఎసిడి పిఒ సుగుణ, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**జి.సిగడాం :** మండలంలోని పెంట ప్రాథమికోన్నత పాఠశాలలో ముందస్తు ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థులు వివిధ



రణస్థలం : బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

సాంస్కృతి, సాంప్రదాయ వేషధారణలో పాఠశాలకు వచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మజ్జి మదన్‌మోహన్, అధ్వానంపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరుణకుమారి పాల్గొన్నారు.

**టెక్కలి రూరల్:** మండలంలోని లింగాలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా ఉగాది సంబరాలను ప్రధానోపాధ్యాయులు ఎం.అనురాధ ఆధ్వర్యాన నిర్వహించారు. తెలుగు వారి సాంప్రదాయాలు విద్యార్థులు తెలియజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో ముగ్గును వేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వై.సింహాచలం, సూర్యప్రకాష్, శైలజ సుభాషిని, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, పాపారావు, ఇందుమతి, నారాయణరావు పాల్గొన్నారు.

## దళిత ఎమ్మెల్యేపై దాడి సరికాదు

**సంతబొమ్మాళి :** అసెంబ్లీ సాక్షిగా దళిత ఎమ్మెల్యే సుధాకర్‌బాబుపై టిడిపి ఎమ్మెల్యేలు దాడి చేయడం సరికాదని సంతబొమ్మాళి ఎస్‌సి సెల్ అధ్యక్షుడు కూరాకుల అప్పారావు అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మాజీ సిఎం చంద్రబాబు, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడులు అసెంబ్లీలో అంబేద్కర్ రాజ్యాంగానికి తూట్లు పొడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మండల ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షులు గేదెల చంద్రరావు, కార్యదర్శి కూరాకుల సుబ్బారావు, సంతబొమ్మాళి సర్పంచ్ ప్రతి కళింగపట్నం అప్పారావు, మండల క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు పిసా పాపారావు, దళిత నాయకులు దువ్వాడ ప్రసాద్, బమ్మి రమేష్, యడ్ల లోకనాథ్ పాల్గొన్నారు.


విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు

## ఓటమి భయంతోనే దౌర్జన్యం

**కవిటి:** రాష్ట్రంలో ఇటీవల వెలువడిన మూడు పట్టభద్రుల ఎమ్మెల్సీల ఓటమితో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి భయం పట్టుకుందని, దాంతోనే అసెంబ్లీలో దౌర్జన్యకాండకు తెరలేపారని మండలం టిడిపి నాయకులు మణిచంద్రప్రకాష్, బెందాలం రమేష్, సీపాన వెంకటరమణ, పొందల కష్టారావు ఆరోపించారు. అసెంబ్లీలో దళిత ఎమ్మెల్యేపై దాడికి పాల్పడడమే కాకుండా అడ్డుకున్న టిడిపి ఎమ్మెల్యేలపై కూడా వైసిపి నాయకులు చేసిన దాడికి నిరసనగా కవిటి బస్టాండ్ కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సదానంద రౌలో, సంతోష్ పట్నాయక్, బాసుదేవ్ రౌలో, బాసుదేవ్ ప్రధాన్, లోళ్ల శ్రీను, బెందాళం విజయ్, పుల్లట రాజు, పుల్లట సంతోష్, బార్ల చినబాబు పాల్గొన్నారు.

## ఆర్థికసాయం అందజేత

**బూర్జ :** మండలంలోని సింగన్నపాలెంకు చెందిన సూరపు అప్పమ్మ ఇల్లు ఇటీవల అగ్నికి ఆహుతైంది. విషయం తెలుసుకున్న ఆమదాలవలస నియోజకవర్గ జనసేన నాయకులు కొత్తకోట నాగేంద్ర ఆధ్వర్యాన కొల్ల జయరామ్, ఎంపిటిసి విక్రమ్, కోరుకొండ మల్లేశ్వరరావు తమవంతు సాయంగా రూ.పది వేలు నగదు, ఆరు బ్యాగ్ సిమెంట్ అందజేశారు. తులగాపు మౌళి, జగ్గారావు, టి.శ్రీనివాస్ మాస్టారు, పి.యోగి, కె.నరేష్, టి.తిరుపతి, గేదెల వాసు, సంగంనాయుడు, ఎస్.రమేష్, ఆర్.అనంత్ పాల్గొన్నారు.

# నారాయణవలస సంత వేలంపాట ఖరారు


వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని నారాయయణవలస గురువారపు పశువుల సంత వేలం పాట ఖరారైంది. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిడిఒ కుప్పిలి ఫణేంద్రకుమార్ ఆధ్వర్యాన మండల ప్రత్యేకాధికారి మంద లోకనాథం అధ్యక్షతన మంగళవారం సంత వేలం పాట నిర్వహించారు. మండలంలోని పెద్దదూగాంకు చెందిన యాళ్ల రాము రూ. 90.5 లక్షలకు పాట పడి సొంతం చేసుకున్నాడు. ఈ సంత వేలం పాటలో పట్ట ఈశ్వరమ్మ, వడాల ఆదిలక్ష్మి, యాళ్ల రాము, తర్ర గణపతిలు పాల్గొన్నారు. మొదటిగా సర్కార్‌వారి పాట రూ.57 లక్షలకు ప్రారంభంగా కాగా, వడాల ఆదిలక్ష్మి రూ. 90 లక్షలకు పాడారు. ఆమెపై యాళ్ల రాము మరో రూ.5 వేలు వేసి రూ.90 లక్షల 5 వేలుకు పాటను పాడారు. వచ్చే నెల ఏప్రిల్ 1 నుంచి వచ్చే యేడాది మర్చి 31 వరకు ఈ వేలం పాట కాలపరిమతి ఉంటుందని ఎంపిడిఒ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ షేక్‌మహ్మద్ అలీ, ఇఒపిఆర్‌డి, మండల పరిషత్ సూపరెండెంట్ ఎస్.రాజేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన

**జి.సిగడాం :** జి.సిగడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై జె.ఆర్.పురం సిఐ ఆదాం మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలకు వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు వాహనాలను ఎక్కితే నంబర్లను గుర్తించుకోవాలన్నారు. అలాగే తల్లిదండ్రులు తప్ప మిగిలిన వారు ఎవరైనా టచ్ చేసేటప్పుడు గుడ్, బ్యాడ్ టచ్ అని తెలుసుకొని వెంటనే స్పందించి సమాచారం అందజేశారు. ఇతరులు తినుబండారాలు ఇచ్చే వారిని నమ్మరాదని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ చామంతుల రామారావు, ఎఎస్ఐ రామకృష్ణ, ప్రధానోపాధ్యాయులు పి.వి.నరసింహమూర్తి, ఉపాధ్యాయులు రవికుమార్ పాల్గొన్నారు.

**పొందూరు:** వయసుకు మించిన స్నేహం చేయవద్దని శ్రీకాకుళం స్ఫూర్తి టీం సభ్యులు రామరాజు, స్రవంతి,


జి.సిగడాం : అవగాహన కల్పిస్తున్న సిఐ ఆదాం

సంతోషకుమారిలు అన్నారు. మండలంలోని తాడివలస, తోలాపి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో దిశ చట్టంపై అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లఖినాన హేమనాచార్యులు, కె.భూలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కారుపై కూలిన చెట్టు

**పర్లాకిమిడి :** గజపతి జిల్లా కాశీనగర్ పట్టణానికి సమీపాన హైవే రోడ్డుపై వెళ్తున్న పోరెడ్డి బాబూరావు కారుపై చెట్టు కూలిపోయింది. దీంతో కారు ముందు భాగంగా దెబ్బతింది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నాని మంగళవారం ఉదయం ఒక్కసారిగా చెట్టు కూలి కారు పడడంతో అందులోని ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు.


కారుపై పడిన చెట్టు


చెక్కును అందిస్తున్న నాయకులు

## వైఎస్ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలంలో నౌపడలో మంగళవారం సర్పంచ్ పిలకా బృందావతి, రవికుమార్‌రెడ్డిలు ఆధ్వర్యాన ఎన్నింటి ఎండు కుటుంబానికి వైఎస్ఆర్ బీమా చెక్కును అధికారులు మంగళవారం అందించారు. గతేడాది అక్టోబరులో చెరువులో పడి మృతి పిన్నింటి ఎండు మృతి చెందారు. ఈయన బీమా పథకంలో పేరు నమోదు చేసుకోవడంతో నామినీ అయిన భార్య కనకమ్మకు బీమా వర్తించింది. గతేడాది తక్షణ సాయం కింద రూ.పది వేలు అందజేశారు. మిగతా రూ.4,90,000 చెక్కును అందించారు. కార్యక్రమంలో ఎంపిటిసి దమయంతి, రాములు, సచివాలయ సిబ్బంది గవరయ్య, వెంకటరమణ, శ్రీరామ్, వాలంటీర్లు పాల్గొన్నారు.


పంటను పరిశీలిస్తున్న ఎఒ నరసింహమూర్తి

## టి.శాసనంలో 'పొలంబడి'

**సోంపేట :** మండలంలోని టి.శాసనంలో మంగళవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ పొలంబడి క్షేత్రాలను స్థానిక వ్యవసాయ అధికారి బి.నరసింహమూర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వేరుశెనగ పంటకు అడవిపందుల నుంచి ఇబ్బందులు కలుగుతున్నాయని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎఒ మాట్లాడుతూ రబీలో సైతం ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. కుసుమ పంట ప్రోత్సాహకం గురించి వివరించారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## చిరుధాన్యాలతో అధిక ప్రయోజనం

ప్రజాశక్తి- బూర్జ

చిరుధాన్యాలతో అధిక ప్రయోజనాలు కలుగుతాయని ఎంపిపి కర్నేన దీప అన్నారు. మండలంలోని లక్కపురంలో చిరుధాన్యాల ఆవశ్యకతపై మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ప్రస్తుతం వివిధ రసాయనాలతో పండిస్తున్న ఆహార ఉత్పత్తులను వినియోగిస్తుండడం వల్ల ఎన్నో అనర్థాలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. చిరు ధాన్యాలైన కొర్రలు, రాగులు, ఊదలు, గోధుమలు వంటి చిరుధాన్యాలను తీసుకుంటే దీర్ఘకాలిక వ్యాధులు దరిచారన్నారు, కార్యక్రమంలో జెడ్‌పిటిసి బి.రామారావు, ఎంపిడిఒ రవీంద్రబాబు, ఎంపిపి ప్రతినిధి కె.నాగేశ్వరరావు, ఇ.బాబూరావు, మణి, సరస్వతి, పరమేశ్వరి పాల్గొన్నారు.


చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న 'ఎంజిఆర్'

## చంద్రబాబును కలిసిన 'ఎంజిఆర్'

**పాతపట్నం :** ఇటీవల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముగ్గురు అభ్యర్థులు విజయం సాధించారు. ఈ మేరకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజయవాడలో మంగళవారం అభినందన సభ నిర్వహించారు. ఈ భలో పాతపట్నం నియోజకవర్గం టిడిపి నాయకులు, సామాజిక వేత్త మామిడి గోవిందరావు పాల్గొన్నారు. సభ ముగిని అనంతరం బాబును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం నియోజకవర్గంలోని టిడిపి పరిస్థితిని వివరించారు.

## వైద్య శిబిరానికి స్పందన

**కవిటి:** జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు మండలంలోని మెళియాపుట్టుగ, డొంకపుట్టుగ గ్రామాల్లో జనసేన రాష్ట్ర మత్స్యకార వికాస విభాగ కార్యదర్శి నాగుల హరి బెహరా ఆధ్వర్యాన శ్రీకాకుళం మెడికవర్ ఆస్పత్రి సౌజన్యంతో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 300 మందికి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం జనసేన పార్టీ ఇన్‌ఛార్జి దాసరి రాజు, నాయకులు లోళ్ల రాజేష్, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ బైపల్లి ఈశ్వరరావు, శారదా ఈశ్వరరావు పాల్గొన్నారు.